సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

చినజీయర్ స్వామిని కలిసిన దేవన్‌రెడ్డి



చినజీయర్ స్వామిఆశీర్వాదం తీసుకుంటున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామిని శుక్రవారం వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయ కర్త తిప్పల దేవన్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని చినజీయర్ స్వామి ఆశ్రమంలో ప్రత్యేకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

పైడిమాంబ ఆలయంలో విశేష పూజలు



లలితా పారాయణ చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ:జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో లలితాపారాయణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్లు మంత్రి శంకరనారాయణ, మునగపాక అచ్చింనాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి. వేమువజాము నుంచే విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నరవ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రంప చోడవరం ఎమ్మెల్యే తీరు హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు

ఉక్కునగరం: గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని అసెంబ్లీ వేదికగా రంప చోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కోరడం హాస్యాస్పదమని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు ఉక్కునగరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్టీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శిరీషాదేవి గిరిజనులపై తనకున్న వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వైఖరిని తాము ఖండిస్తున్నామని చెప్పారు. సమావేశంలో సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోడంరాజు, నాయకులు దేవినాయుడు, నారాయణమూర్తి, కల్యాణ్ పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మా కాలనీలో కొలువైన కనక దుర్గ అమ్మవారి ఆలయ 29వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం అమ్మవారికి వేకువజామున మేలుకొలుపు, పంచామృతాభిషేకాలు, 108 మట్టి కలశాలతో విశేష ద్రవ్యాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం చండీయాగం నిర్వహించారు. రాత్రి భజనలు, దశవిధ హారతులు, ఉయ్యాల సేవ, పవళింపు సేవ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్పీ) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఆర్పీల సమస్యలపై చర్చించి, నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి మాట్లాడుతూ సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో రోడ్లపై నడుస్తున్న జనం



ఒక పక్క ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగులు.. మరోపక్క ఫుట్‌పాత్‌లపై దుకాణాలు.. ఇంకో వైపు పార్కింగ్ సౌకర్యం లేని వాణిజ్య సముదాయాలు. హోటళ్లు, షాపింగ్ మాళ్లు.. ఇదంతా ఒక ఎత్తయితే ఆటోల హల్‌చల్ మరో ఎత్తు. గాజువాక ప్రధాన రహదారి (మెయిన్ రోడ్)లో నిత్యం ఎదురయ్యే పరిస్థితి ఇది. సాధారణ రోజుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే..ఇక పండగల సమయంలో ఎలా ఉంటుందో చెప్పక్కర్లేదు. రహదారి మొత్తం పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. రోడ్డులో వెళ్లాలంటే పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి. పాతగాజువాక నుంచి కొత్త గాజువాక వరకు గల కిలోమీటరు దూరం ప్రయాణించాలంటే ట్రాఫిక్ చక్రబంధంలోచిక్కుకోవాల్సిందే.. – గాజువాక



సాయంత్రం సమయంలో గాజువాక మెయిన్‌రోడ్‌లో ట్రాఫిక్ కష్టాలు

ప్రధాన మార్గం.. పద్మవ్యూహం!



అస్తవ్యస్త పార్కింగ్‌లతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్డుపై నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. గాజువాక మెయిన్ రోడ్‌లోనే రాంగ్ పార్కింగ్‌కు సంబంధించి గాజువాక ట్రాఫిక్ పోలీసులు సగటున రోజుకు 80 కేసులు నమోదు చేస్తున్నట్టు చెబుతున్నారు. దీన్ని బట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక పక్క ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, మరో పక్క రోడ్డుపై అడ్డూ అదుపూలేని పార్కింగ్‌వల్ల ఈ సమస్య జటిలమవుతోంది. గాజువాక ప్రధాన రహదారి (మెయిన్ రోడ్డు) పద్మవ్యూహంగా మారుతోంది. దయం పూట, సాయంత్రం ఐదు గంటల తరువాత రోడ్డుపై నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

సెల్లార్ పార్కింగ్ మర్చిపోయినట్టే!

సెల్లార్లను ఉపయోగిస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని గతంలో జీవీఎంసీ అధికారులు భావించి పలు సెల్లార్లలో ఆక్రమణలను తొలగించిన విషయం తెలిసిందే. గాజువాక మెయిన్ రోడ్‌లోని 24 సెల్లార్లలో ఆక్రమణలను గుర్తించారు. రాజకీయ ఒత్తిళ్లు వచ్చినప్పటికీ అధికారులు 10 సెల్లార్లలో ఆక్రమణలను ఖాళీ చేయించారు. అయితే, ఆ తర్వాత వాటిని పట్టించుకోకపోవడంతో భవన యజమానులు సెల్లార్లను యథాతథంగా ఆక్రమించేశారు. దీంతో వాహనచోదకులు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. సెల్లార్ పార్కింగ్ సౌకర్యం ఉన్నచోట రోడ్లపై నిలిపితే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ట్రాఫిక్ పోలీసులదేనని జీవీఎంసీ అధికారులు చేతులు దులుపేసుకోవడం, పోలీసులు కూడా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో గత అధికారులు చేసిన ప్రయత్నాలు కనుమరుగైపోయాయి.

ఆ ప్రతిపాదనలు బుట్టదాఖలు !

గాజువాక పట్టణంలో ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్‌ను నిరోధించడానికి పెయిడ్ పార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని గతంలో జీవీఎంసీ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. గాజువాక మెయిన్ రోడ్‌లో నాలుగు చోట్ల పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. దీనిపై సర్వే పూర్తి చేసి నివేదికలు కూడా తయారు చేశారు. ఆ తరువాత అధికారులు మారిపోవడం, కొత్తగా వచ్చిన ప్రజాప్రతినిధులకు ఆ విషయాన్ని పట్టించుకోకపోవడంతో అప్పటి నివేదికలు, ప్రతిపాదనలు అటకెక్కాయి.

ఆక్రమణలతో కుదించుకుపోతున్న రోడ్

మాస్టర్ ప్లాన్ ప్రకారం గాజువాక మెయిన్ రోడ్ 240 అడుగుల వెడల్పుతో ఉండాలి. అయితే, రహదారికిరువైపులా భారీ వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, షాపింగు మాళ్లు తదితర దుకాణాలు పెరగడంతో అధికారులు రోడ్డును విస్తరించాలన్న ఆలోచనే చేయలేని పరిస్థితి ఉంది. ఉన్న రహదారిపై కూడా దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు ద్విచక్రవాహనాలు, కార్లు పార్కింగ్ చేస్తుండటంతో మరింత చిన్నదైపోయింది. వీటికి తోపుడు బళ్లు అదనం. తోపుడు బళ్ల కోసం ప్రత్యేకంగా హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి వారిని అక్కడికి తరలించాలని గతంలో అధికారులు ప్రయత్నాలు చేశారు. వివిధ కారణాలతో ఆ ప్రతిపాదన మరగునపడింది. జోన్ ఏర్పాటులో గందరగోళ పరిస్థితిని అధిగమించలేక అధికారులు చేతులెత్తేశారు. ఈ కారణంగా మెయిన్ రోడ్డు రెండు పక్కలా సుమారు 20 అడుగుల వరకు కుదించుకుపోతోంది.



మెయిన్ రోడ్‌లో పార్కింగ్ తీరు ఇలా

సెల్లార్ పార్కింగ్ అందుబాటులోకి తెస్తాం

గాజువాకలో సెల్లార్ పార్కింగ్‌ను అందుబాటులోకి తెస్తాం. ఇప్పటికే వివిధ భవనాల్లో సెల్లార్లను గుర్తించాం. సంబంధిత యజమానులకు నోటీసులను జారీ చేస్తాం. టౌన్‌ప్లానింగ్‌కు పూర్తిస్థాయి ఏసీపీ లేకపోవడంతో దీనికి సంబంధించిన చర్యల్లో కొంత జాప్యం జరుగుతోంది. గాజువాక ట్రాఫిక్ పోలీసులతో కలిసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపడతాం. హాకర్స్ జోన్‌పై ఆలోచిస్తాం. కొన్నిచోట్ల సెల్లార్ పార్కింగ్‌ను గతంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటిని కూడా పరిశీలించి అవసరమైన [illegible] చేపడతాం.

– బీఆర్‌ఎస్ శేషాద్రి, జోనల్ కమిషనర్, గాజువాక

చర్యలు తీసుకొంటున్నాం

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొంటున్నాం. సెల్లార్లను అందుబాటులోకి తెస్తే కొంత సమస్య తీరుతుంది. దీనిపై జీవీఎంసీ అధికారులతో కలిసి ఉమ్మడి కార్యాచరణకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొంతమంది భవన యజమానులకు నోటీసులు కూడా ఇచ్చాం. మెయిన్‌రోడ్‌లో ఇష్టానుసారం పార్కింగ్ చేసే వాహనాలకు అపరాధ రుసుం విధిస్తున్నాం. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాల్సిన అవసరం ఉంది. దీనికి అన్నివర్గాల ప్రజలు సహకరించాలి.

– కోటేశ్వరరావు, గాజువాక ట్రాఫిక్ సీఐ

సకల కళా కోవిదుడు అప్పారావుకు సత్కారం



డోలక్ అప్పారావును సత్కరిస్తున్న షిర్డీసాయి సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి షిర్డీసాయి మందిర కమిటీ ఆధ్వర్యంలో హోలీ పండగను పురస్కరించుకొని సకల కళా కోవిద బిరుదుపొందిన ఆర్టీసీ డ్రైవర్, జాజుల (డోలక్) అప్పారావును ఘనంగా సత్కరించారు. ముందుగా సాయిబాబాకు కాగడ హారతి, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ అనంతరం అష్టోత్తర నామావళి జరిపించారు. అనంతరం అప్పారావును సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా ఆలయంలో నిర్వహించే ప్రతీ భక్తిగీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమంలో అప్పారావు పాల్గొవడంతోపాటు కోలాటం, భజన పాటలు, చిత్రలేఖనం, బుర్రకథల్లో రాణిస్తూ సకల కళా కోవిదునిగా బిరుదు పొందారన్నారు. అటువంటి అప్పారావును సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. భాస్కరభట్ల సత్యప్రసాద్ శర్మ, ధర్మాల సుబ్బారావు మాట్లాడుతూ అగనంపూడిలో ఏ భక్తి గీతాలాపన జరిగినా డోలక్ అప్పారావు లేని కార్యక్రమం ఉండదన్నారు.తర్వాత అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో యోగా గురుజీ ఈశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు జి.శంభుడు, పి.సత్యనారాయణ, సత్యలక్ష్మి, పి.పంకజ, జి.లీలావతి, పి.రామారావు, పీఎల్‌ఎన్‌రాజు, టోపీరాజు, సూరీడమ్మ, ఎం.పద్మావతి, బి.పద్మజారాణి, పి.గోవిందరావు పాల్గొన్నారు.

హోలీ.. ఆనందాల కేళి



హోలీ సంబరాల్లో మహిళలు



రంగులు జల్లుకొంటున్న చిన్నారులు

గాజువాక: హోలీ వేడుకలు గాజువాక ప్రాంతంలో సందడిగా సాగాయి. యువత, పిల్లలు హోలీ రంగులు జల్లుకున్నారు. విద్యార్థులు ఒకరికొకరు రంగులు జల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

పెదగంట్యాడ: మండలంలో పలు చోట్ల శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. హోలీ పండగ అంటేనే చిన్నారులు, మహిళలకు ఎంతో ఆనందం.. అలాంటి పండగను మండలంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ, నడుపూరు, సీతానగరం, పెదగంట్యాడ, వికాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా రంగులు జల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

సందడిగా హోలీ

అక్కిరెడ్డిపాలెం: హోలీ పండగను శుక్రవారం పలు ప్రాంతాల్లో ఆనందమయంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరికొనొకరు హోలీ శుభాకాంక్షలు చెబుతూ రంగులు జల్లుకుంటూ సందడి చేశారు. అక్కిరెడ్డిపాలెం, పంచవటి, నాతయ్యపాలెం, హరిజనజగ్గయ్యపాలెం, షీలానగర్, వెంకటేశ్వరకాలనీ, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో యువతీ యువకులు ఉత్సాహంగా గడిపారు.



అక్కిరెడ్డిపాలెంలో ఆనందాల మధ్య హోలీ జరుపుకుంటున్న కుటుంబ సభ్యులు



పంచవటీలో రంగులు పూసుకుని సందడి చేస్తున్న చిన్నారులు

వాహనాలు ఇలా.. ఆస్పత్రికి వెళ్లేదెలా?



మిందె యూపీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో రోడ్డుపై పార్కింగ్ చేసిన భారీ వాహనాలు

అక్కిరెడ్డిపాలెం: ఆస్పత్రికి వెళ్లే మార్గంలో భారీ వాహనాలను అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. 68వ వార్డు రాంనగర్, మిందిలో పలు పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను యూపీహెచ్‌కి వెళ్లే మార్గంలో నిర్లక్ష్యంగా నిలుపుతున్నారు. రోజుల తరబడి వీటిని రోడ్డుపైనే వదిలేయడంతో ఆస్పత్రికి అత్యవసర పరిస్థితుల్లో రోగులు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబులెన్స్‌లు, ఇతర వాహనాల్లో రోగులకు తరలించడానికి ఆటంకం కలుగుతోంది. ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారిపై మాత్రమే దృష్టి సారించకుండా ఇలాంటి వాటిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీవారికి విశేష అభిషేకాలు



అక్కిరెడ్డిపాలెం:షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శుక్రవారం రాత్రి పాల్గుణ పౌర్ణమి, లక్ష్మీ జయంతిని పురస్కరించుకొని ఉత్సవ పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే తిరుమలేశునికి పంచామృతాభిషేకం, లలితా సహస్ర నామార్చన, అభిషేక పూజలు నిర్వహించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సారె.. అదిరె



అమ్మవారి సారె ఊరేగిస్తున్న దయాల్‌నగర్ వాసులు

పెదగంట్యాడ: మన సంస్కృతి, సంప్రదాయాలకు అమ్మవారి పండగలు ప్రతీకగా నిలుస్తాయని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. కొత్త అమావాస్యను పురస్కరించుకొని జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో వేంచేసియున్న స్వర్ణ నూకాంబిక అమ్మవారి సారెను శుక్రవారం ఊరేగించారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏటా అమ్మవారి పండగను ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ ప్రతినిధులను అభినందించారు. అనంతరం 108 రకాల పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

గాజువాక: అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆశ్రా) ఆధ్వర్యంలో రూపొందించిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ పోస్టర్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి.దేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థిరమైన జీవనశైలికి సరళమైన పరివర్తన నినాదంతో ఆశ్రా తలపెట్టిన కార్యక్రమాన్ని ఆమె అభినందించారు. శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు తోట శతృఘ్నుడు, జిల్లా సివిల్ సప్‌లెస్ అధికారి కల్యాణి, గాజువాక మండల విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీత, లీగల్ మెట్రాలజీ అధికారి విజయ సునీత, బేగం, ఏఎస్‌వో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



దాతకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి గాజువాకకు చెందిన సోపల్లి నారాయణ రూ. 1,00,011 లక్షల విరాళం అందజేశారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

ఎమ్మెల్సీ గాదె దృష్టికి వీవీవీ స్కూల్ సమస్యలు



ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉక్కునగరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. సుమారు రెండు వేల మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ ఏడాది నూతన ప్రవేశాలను నిలిపివేశారని పేర్కొన్నారు. ఉక్కు యాజమాన్యం సహకారంతో అతి తక్కువ ఫీజులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని, నూతన అడ్మిషన్లను నిలిపివేయడం వల్ల విద్యార్థులు కూడా ఇబ్బంది పడతారని తెలిపారు. అనంతరం ఆయన్ను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఎలిరియా, ఉపాధ్యాయులు అనిత, జ్యోతి, శారద, సత్యం, దేవాదాస్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.